క్లుప్తంగా

రెఫర్ కేసులపై దృష్టి పెట్టండి



మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ ప్రభావతి

చిత్తూరు రూరల్: జగనన్న ఆరోగ్య సురక్ష రెఫర్ కేసులపై దృష్టి పెట్టి ఆరోగ్యశ్రీ ద్వారా సేవలు అందేలా చూడాలని డీఎంహెచ్ఓ ప్రభావతిదేవి అన్నారు. చిత్తూరులోని తన కార్యాలయంలో మంగళవారం ఆమె ఆరోగ్య సేవలపై సమీక్ష నిర్వహించి మాట్లాడారు. వికసిత్ భారత్ సంకల్పయాత్రలో భాగంగా సచివాలయ పరిధిలో హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేయాలన్నారు. టీబీ సేవలను మరింత విస్తృతం చేయాలని తెలిపారు. హైరిస్క్ గర్భిణులకు సకాలంలో వైద్యసేవలు అందేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో డీఐఓ రవిరాజు, జిల్లా క్షయ నివారణ అధికారి వెంకటప్రసాద్, అధికారులు అనిల్, జార్జ్ గుణశేఖర్ పాల్గొన్నారు.

లింగ వివక్షను రూపుమాపుదాం



మాట్లాడుతున్న ఏపీఎం సుధారాణి

గుడిపాల: కేంద్రప్రభుత్వం ఆధ్వర్యంలో జెండర్ ఆధారిత హింసకు వ్యతిరేకంగా పానాటూరు పంచాయతీలో గ్రామ సమాఖ్య ఆధ్వర్యంలో అవగాహన సదస్సు, ర్యాలీని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎం సుధారాణి మాట్లాడుతూ స్త్రీ, పురుషులు సమానమని, లింగ వివక్ష చూపకూడదన్నారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని చెప్పారు. ప్రతి ఒక్కరూ దిశా యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని ఆమె సూచించారు. వెలుగు సీసీ లోకనాథరెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్ ప్రారంభం



వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న సుగుణాకర్‌రెడ్డి

పూతలపట్టు: మండలంలోని వావిల్‌తోటలో మంగళవారం నూతన వాటర్‌ప్లాంట్‌ను పారిశ్రామికవేత్త పైమాఘం సుగుణాకర్‌రెడ్డి ప్రారంభించారు. వాటర్ ప్లాంట్ యంత్ర పరికరాలకు తన సొంత నిధులు రూ.2.50లక్షలు వెచ్చించారు. పెనుగొండ పరిశీలకులు బాబురెడ్డి, పార్టీ కన్వీనర్ శ్రీకాంత్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పరమేశ్వర్‌రెడ్డి, వైస్ ఎంపీపీలు ద్వారకనాథరెడ్డి, మురళీకృష్ణ, సర్పంచ్ సంఘ అధ్యక్షుడు జయచంద్రారెడ్డి, రాజారత్నంరెడ్డి, సచివాలయాల కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, సర్పంచ్ మహేశ్వరి, జెడ్పీటీసీ సభ్యురాలు దేవిక, సింగిల్ విండో అధ్యక్షుడు దొరస్వామిరెడ్డి, ఎంపీడీఓ గౌరి, పీఆర్ ఏఈ ప్రసాద్ పాల్గొన్నారు.

72 మందికి ఇంటి స్థలాల కేటాయింపు



లబ్ధిదారులకు స్థలం కేటాయిస్తున్న రెవెన్యూ అధికారులు

తవణంపల్లె: పట్నం, మైనగుండ్లపల్లె పంచాయతీలో ఇంటి స్థలం లేని పేదలకు మంగళవారం ఇంటి స్థలాలు కేటాయించినట్లు తవణంపల్లె తహసీల్దార్ గుణశేఖర్‌రెడ్డి తెలిపారు. 72 మందికి రెండేళ్ల క్రితం ఇంటి పట్టాలు మంజూరు చేశారు. ఇంటి పట్టాల లబ్ధిదారులకు స్థలం కొలతలు వేసి ఒకటిన్నర సెంటు భూమిని కేటాయించి వారికి స్వాధీనం చేసినట్లు వివరించారు. భూ రీసర్వే డీటీ వెంకటరమణ, వీఆర్‌ఓ దశరథన్, సర్వేయర్లు, వైఎస్సార్‌సీపీ నేత ప్రకాష్‌బాబురెడ్డి పాల్గొన్నారు.

జెండర్ ఆధారిత హింసను విడనాడాలి



ర్యాలీ నిర్వహిస్తున్న మహిళలు

పూతలపట్టు: జెండర్ ఆధారిత హింసను విడనాడాలని ఎంపీడీఓ గౌరి అన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో 'జెండర్ ఆధారిత హింస' అనే జాతీయ కార్యక్రమాన్ని ఉద్దేశించి మహిళలు ర్యాలీని నిర్వహించారు. మహిళలపై జరుగుతున్న హింసను అరికట్టాలని కోరారు. ఏపీఎం నాగరత్న, సర్పంచ్ మణి, సీసీ శోభన్ పాల్గొన్నారు.

నేడు ప్రవచనాలు

కాణిపాకం(యాదమరి): కాణిపాక వినాయక స్వామి ఆలయంలో ఇచ్ఛాపురం నైమిషారణ్య పీఠాధిపతులు బాలబ్రహ్మానంద సరస్వతిచే నేడు బుధవారం ప్రవచనాల కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ మోహన్‌రెడ్డి, ఈఓ వెంకటేశు తెలిపారు. స్వామివారి ఆస్థాన మండపంలో ఉదయం 10 గంటలకు ప్రారంభించే ఈ ప్రవచనాల కార్యక్రమాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నవరత్నాలతో ప్రతి గడపకూ లబ్ధి



చామంతిపురంలో జెండాను ఆవిష్కరించిన ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

చిత్తూరు కార్పొరేషన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అందిస్తున్న నవరత్న పథకాలతో ప్రతి గడపకూ లబ్ధి చేకూరిందని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం దొడ్డిపల్లె, కట్టమంచి, చామంతిపురం డివిజన్లలో నిర్వహించిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్ని మాట్లాడారు. అనంతరం సచివాలయాలలో సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డును ప్రారంభించారు. కూడళ్లలో వైఎస్సార్‌సీపీ జెండాలను ఆవిష్కరించారు. చుడా చైర్మన్ పురుషోత్తంరెడ్డి, డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్, నగర పార్టీ అధ్యక్షుడు జ్ఞాన జగదీష్, టిమ్ము, మార్కెట్ కమిటీ చైర్మన్ రాహుల్ రెడ్డి, నగర సచివాలయ కన్వీనర్లు రాంగణేష్, కిరణ్, కార్పొరేటర్లు సునీత, స్వరూపరాణి. ఇందు, హరిణిరెడ్డి, చల్లాముత్తు, నేతలు శివకుమార్, నళిని, తిరుకుమారన్, మనోహర్‌రెడ్డి, శివ, బాబి, శేఖర్, మనోజ్‌రెడ్డి, కుమార్ పాల్గొన్నారు.

ఐరాలలో..

ఐరాల: గుండ్లపల్లె సచివాలయంలో మంగళవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం సచివాలయంలో వైఎస్సార్‌సీపీ నేతలు సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించి, పార్టీ జెండాను ఎగురవేశారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, సర్పంచ్ రెడ్డెమ్మ, వైస్ సర్పంచ్ విజయసింహారెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ ప్రతాప్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు లోకేశ్వర్‌రెడ్డి, పార్టీ నేతలు నరేంద్రరెడ్డి, రవీంద్రారెడ్డి, రాజారెడ్డి, హేమలత, కిషోర్‌రెడ్డి, వినాయకరెడ్డి, బుజ్జిరెడ్డి, మునిరత్నంరెడ్డి, జయరాంరెడ్డి, ఎంపీడీఓ నాగరాజు, ఈఓపీఆర్డీ కుసుమకుమారి, పంచాయతీ కార్యదర్శి బేబి పాల్గొన్నారు.

మంచి చేస్తున్నందుకే ధైర్యంగా ప్రజల్లోకి

బంగారుపాళెం: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించి మంచి చేస్తున్నందుకే ప్రజల్లోకి ధైర్యంగా వెళ్తున్నామని జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ రామచంద్రారెడ్డి, ఎంపీపీ అమరావతి అన్నారు. మంగళవారం చీకూరుపల్లెలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని నిర్వహించారు. సచివాలయం పరిధిలో సంక్షేమ పథకాలు, అభివృద్ధి వివరాలకు సంబంధించిన డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. అనంతరం గ్రామంలో వైఎస్సార్‌సీపీ జెండాను నేతలు ఆవిష్కరించారు. ఎంపీటీసీ సభ్యురాలు స్వాతి, కో ఆప్షన్ సభ్యుడు ఫిరోజ్‌అహ్మద్, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు కిషోర్‌కుమార్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి చందు, ప్రోగ్రాం కోఆర్డినేటర్ దుర్గాప్రసాద్, నేతలు చీకూరి శ్రీనివాసులు, చంద్రారెడ్డి, జయదేవ్‌రెడ్డి, శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.



బంగారుపాళెం: చీకూరుపల్లెలో మాట్లాడుతున్న ఎంపీపీ అమరావతి

యాదమరిలో..

యాదమరి: బోధగుట్టపల్లె సచివాలయ పరిధిలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వైఎస్సార్‌సీపీ జెండాను నేతలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో యాదమరి ఎంపీపీ సురేష్ బాబు, వైస్ ఎంపీపీ రవీంద్రబాబు, జిల్లా వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి మనోహర్ రెడ్డి, నేత హరనారాయణరెడ్డి పాల్గొన్నారు.

పూతలపట్టులో..

పూతలపట్టు: బైటపల్లి పంచాయతీలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలనే కార్యక్రమం నిర్వహించారు. ముందుగా వైఎస్సార్‌సీపీ జెండాను పార్టీ నేతలు ఆవిష్కరించారు. అనంతరం సంక్షేమ పథకాల లబ్ధి వివరాల బోర్డును ప్రారంభించారు. అనంతరం కరపత్రాలను ప్రజలకు అందజేశారు. పెనుగొండ పరిశీలకులు బాబురెడ్డి, పార్టీ కన్వీనర్ శ్రీకాంత్‌రెడ్డి, రాజారత్నంరెడ్డి, వైస్ ఎంపీపీ ద్వారకనాథరెడ్డి, సచివాలయాల కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, సర్పంచ్ రామతులసి, సింగిల్‌విండో అధ్యక్షుడు దొరస్వామిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు దేవిక, మండల యువత అధ్యక్షుడు నవీన్‌రెడ్డి, నేతలు బాలాజి, అమర్నాథరెడ్డి, నిరంజన్‌రెడ్డి, బాబురెడ్డి, ఖాదర్‌వల్లి పాల్గొన్నారు.



బోధగుట్టపల్లెలో పార్టీ జెండా ఆవిష్కరిస్తున్న నేతలు



బైటపల్లిలో జెండా ఆవిష్కరిస్తున్న నేతలు

వినాయకుని సేవలో పూతలపట్టు ఎమ్మెల్యే



క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ బాబు, చైర్మన్ మోహన్‌రెడ్డి

కాణిపాకం(యాదమరి): కాణిపాక వరసిద్ధి వినాయకస్వామిని పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు మంగళవారం దర్శించుకున్నారు. ఉదయం ఆయన స్వామి వారి దర్శనార్థం విచ్చేయగా ఆలయ చైర్మన్ మోహన్‌రెడ్డి స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం ఆశీర్వాద మండపంలో వేదపండితులచే ఆశీర్వచనం అందించి స్వామివారి చిత్రపటం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డి, సూపరింటెండెంట్ కోదండపాణి, ఆలయ ఇన్‌స్పెక్టర్ బాబు పాల్గొన్నారు.

2024 సంవత్సర క్యాలెండర్ల ఆవిష్కరణ..

కాణిపాక వరసిద్ధి వినాయకస్వామి ఆలయ 2024 సంవత్సరం క్యాలెండర్లను ఎమ్మెల్యే ఎంఎస్ బాబు, ఆలయ చైర్మన్ మోహన్‌రెడ్డి ఆవిష్కరించారు. మంగళవారం చైర్మన్ కార్యాలయంలో నూతన సంవత్సర క్యాలెండర్లను ఆవిష్కరించి 2024 సంవత్సరంలో అందరికీ శుభాలు కలగాలని ఆయన ఈ సందర్భంగా కోరారు.

నేడు వై ఏపీ నీడ్స్ జగన్

తవణంపల్లె: మండలంలోని ఎగువ తవణంపల్లె సచివాలయంలో నేడు బుధవారం సాయంత్రం 3 గంటలకు వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం జరుగుతుందని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు సి.హరిరెడ్డి, మండల రాష్ట్ర సంయుక్త కార్యదర్శులు గాంధీ బాబు తెలిపారు. మండలంలోని అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఆడుదాం ఆంధ్రాపై అవగాహన కల్పించండి

–సీఈఓ ప్రభాకర్‌రెడ్డి



రికార్డులను పరిశీలిస్తున్న సీఈఓ ప్రభాకర్‌రెడ్డి

పూతలపట్టు : మండలంలో ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంపై పంచాయతీ పరిధిలోని ప్రజలకు పంచాయతీ కార్యదర్శి అవగాహన కల్పించాలని జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఎం బండపల్లి సచివాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. ముందుగా రికార్డులను పరిశీలించారు. తాగునీటి ట్యాంకులు, మురుగుకాలువలు, కుంటలను వెంటనే శుభ్రపరచాలని ఎంపీడీఓ గౌరీని ఆదేశించారు. ఆడుదాం ఆంధ్రాలో భాగంగా గ్రామీణ స్థాయిలో ఆడే యువకులు సచివాలయంలో పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకునేలా గ్రామస్తులకు తెలియపరచాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి హేమలత పాల్గొన్నారు.

మహాసభలను విజయవంతం చేయండి

చిత్తూరు కలెక్టరేట్: ఏబీవీపీ 69వ జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని ఏబీవీపీ చిత్తూరు బాగ్ కన్వీనర్ పవన్ కోరారు. మంగళవారం పీవీకేఎన్ డిగ్రీ కళాశాల వద్ద ఆ సంఘ నాయకులు పోస్టర్లు ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఏబీవీపీ అమృత మహోత్సవ సంవత్సరాన్ని పురస్కరించుకుని డిసెంబర్ 7 నుంచి 10వ తేదీ వరకు ఢిల్లీలో మహాసభలు జరుగుతాయన్నారు. జిల్లాలోని ఏబీవీపీ నేతలు మహాసభల్లో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో నేతలు గజేంద్ర, గౌతమ్, మహేష్ పాల్గొన్నారు.

ఇంటి వద్దకే వైద్యసేవలు



వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ రష్మిత



వీఎస్ అగ్రహారంలో వైద్యపరీక్షలు

గుడిపాల: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో ఇంటి వద్దకే మెరుగైన వైద్యసేవలు ప్రభుత్వం అందిస్తోందని బొమ్మసముద్రం ప్రాథమిక వైద్యాధికారి రష్మిత అన్నారు. మంగళవారం కుప్పిగానిపల్లెలో ఫ్యామిలీ డాక్టర్ నిర్వహించారు. 104 వాహనం ద్వారా 60 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలు, దీర్ఘకాలిక వ్యాధి గ్రస్తులకు పరీక్షలు నిర్వహించారు. వైద్యసిబ్బంది శ్రీలక్ష్మి, సరిత, శిల్ప, సరస్వతి, శివగామి, కుమారి పాల్గొన్నారు.

ఐరాల: ఫ్యామిలీ డాక్టర్‌తో నిరుపేదలకు ఇంటి ముంగిటకే వైద్యసేవలు అందిస్తున్నామని పీహెచ్‌సీ డాక్టర్ పూర్ణలత అన్నారు. వీఎస్.అగ్రహారంలో మంగళవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో 90 మందికి వైద్యపరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

అర్హులందరూ ఓటరుగా నమోదు చేసుకోవాలి

చిత్తూరు కలెక్టరేట్: అర్హులైన విద్యార్థులు ఓటరుగా నమోదు చేసుకోవాలని ఆర్డీఓ చిన్నయ్య విద్యార్థులకు సూచించారు. మంగళవారం నగరంలోని మిట్టూరులో ఉన్న విజయం డిగ్రీ కళాశాలలో ఓటర్ల నమోదుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆర్డీఓ మాట్లాడుతూ ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి నాంది అని అన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతిఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకుని బాధ్యతగా ఓటు వేయాలన్నారు. ఏఓ రామాంజులునాయక్ పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఆర్డీఓ చిన్నయ్య

రోడ్ల వెడల్పునకు సహకరించండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆరణి, చిత్రంలో మేయర్ అముద, కమిషనర్ అరుణ

– ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలో ప్రధాన రహదారుల వెడల్పు, అభివృద్ధి పనుల కోసం ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పిలుపునిచ్చారు. నగరంలోని ఐదు ప్రధాన రహదారుల విస్తరణ, అభివృద్ధి పనులను ఏ విధంగా ముందుకు తీసుకెళ్లాలనే అంశంపై సంబంధిత భవన యజమానులు, పట్టణ అభివృద్ధి కమిటీ సభ్యులతో మంగళవారం చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో మేయర్ అముదతో కలిసి సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నగరంలో ఎంఎస్ఆర్ కూడలి నుంచి వెంకుశ కల్యాణ మండపం వరకు, ఎంఎస్ఆర్ నుంచి కలెక్టరేట్ వరకు, ఎమ్మెస్సార్ నుంచి గుడియాత్తం రోడ్డు వరకు, గాంధీ రోడ్డు నుంచి ఎఫ్‌సీఐ గోడౌన్ వరకు, పాత కోర్టు డౌన్ నుంచి మురకంబట్టు హైవే వరకు రహదారులను వెడల్పు చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. నగర అభివృద్ధి, భావితరాల భవిష్యత్తు కోసం భవన యజమానులు మంచి మనసుతో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. రహదారుల విస్తరణలో భూములు కోల్పోయే వారికి ప్రభుత్వం నుంచి అందే టీడీఆర్ బాండ్లకు అదనంగా నగరపాలక సంస్థ తరపున మరింత సాయం చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. 80 అడుగుల రోడ్డు విస్తరణకు సంబంధించి యజమానులు, నగర అభివృద్ధి కమిటీ సభ్యులతో ఒక కమిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. కమిషనర్ డా.జె.అరుణ, డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్, లీగల్ అడ్వైజర్ లోకనాథరెడ్డి, ఎంఎస్సీ నవీన్‌కుమార్, సహాయ కమిషనర్ గోవర్ధన్, ఏసీపీ రామకష్ణుడు పాల్గొన్నారు.



పాల్గొన్న భవన యజమానులు

పూలే స్ఫూర్తితో బీసీల అభ్యున్నతి

చిత్తూరు రూరల్: మహాత్మా జ్యోతిరావు పూలే ఆశయాలే స్ఫూర్తిగా రాష్ట్రంలో బీసీల అభ్యున్నతికి ప్రభుత్వం అనేక కార్యక్రమాలను చేపడుతోందని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. చిత్తూరు నగరంలో మంగళవారం పూలే 133వ వర్ధంతిని నిర్వహించారు. పీసీఆర్ సర్కిల్‌లో ఉన్న పూలే విగ్రహానికి ఎమ్మెల్యే ఆరణి, రాష్ట్ర మొదిలియార్ కార్పొరేషన్ చైర్మన్ బుల్లెట్ సురేష్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ మహనీయుల జీవితాలను ఆదర్శంగా తీసుకుని ముందుకుసాగాలని పిలుపునిచ్చారు. పూలే ఆశయాలు నిజం చేసేలా ప్రభుత్వం కృషిచేస్తోందన్నారు. నేతలు జ్ఞానజగదీష్, రాంగణేష్ పాల్గొన్నారు.



చిత్తూరు: పూలే విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ఆరణి, బుల్లెట్ సురేష్

పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరం



మురుగునీటి కాలువను పరిశీలిస్తున్న కమిషనర్ అరుణ

చిత్తూరు అర్బన్: వర్షాల నేపథ్యంలో నగరంలోని డ్రైనేజీలు, కల్వర్టులు, లోతట్టు ప్రాంతాల వద్ద ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలని నగర కమిషనర్ డా.జె.అరుణ ప్రజారోగ్య విభాగం అధికారులను ఆదేశించారు. మంగళవారం ఉదయం కమిషనర్ నగరంలో పలు ప్రాంతాల్లో పర్యటించారు. ఎంఎస్ఆర్ కూడలి వద్దనున్న కాలువను పరిశీలించి నీటి ప్రవాహానికి ఇబ్బందులు లేకుండా ఎప్పటికప్పుడు వ్యర్థాలను తొలగించాలని ఆమె ఆదేశించారు. లిల్లీ వంతెన వద్ద పరిస్థితిని కమిషనర్ అరుణ సమీక్షించారు. కమిషనర్ మాట్లాడుతూ కల్వర్టుల వద్ద వ్యర్థాలు చిక్కుకోకుండా ఇనుప మెస్ ఏర్పాటు చేయాలన్నారు. పారిశుధ్య కార్మికులు ప్రతిఒక్కరి ఆరోగ్య పరిస్థితిని రిజిస్టర్లలో నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజారోగ్యశాఖ అధికారి డా.లోకేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు చిన్నయ్య, నరసింహ, లోకనాథం, వార్డు కార్యదర్శులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులు తప్పనిసరి



మాట్లాడుతున్న ఉద్యానవన శాఖ అధికారి మధుసూదన్‌రెడ్డి

చిత్తూరు అగ్రికల్చర్: మామిడి పంటలో యాజమాన్య పద్ధతులు పాటిస్తేనే నాణ్యమైన దిగుబడిని సాధించవచ్చని ఉద్యానవనశాఖ అధికారి మధుసూదన్‌రెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక మ్యాంగో భవనంలో మామిడి పంటలో యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నాణ్యమైన దిగుబడిని సాధించినపుడే ఎగుమతులు చేయగలమని తెలిపారు. మామిడి తోటల్లో కవర్లు కావాల్సిన వారు ఆర్బీకేల్లో సంప్రదించాలన్నారు. క్షేత్రస్థాయిలో ఎప్పటికప్పుడు తెగుళ్లను పరిశీలిస్తూ సకాలంలో చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో ఉద్యాన పంటల్లో ప్రధానంగా మామిడి 27 మండలాల్లో అత్యధికంగా సాగులో ఉందని ఏరువాక కేంద్ర శాస్త్రవేత్త రెడ్డిరాము అన్నారు. తెగుళ్ల నివారణకు అవసరమైన క్రిమిసంహారక మందులను ఆర్బీకేల్లో అందుబాటులో ఉంచుతామని వ్యవసాయశాఖ అధికారి మురళీకృష్ణ తెలిపారు.

అధికారులకు నగదు ప్రోత్సాహకాలు



ఎస్పీ నుంచి నగదు రివార్డు అందుకుంటున్న సీఐ విశ్వనాథరెడ్డి, ఎస్ఐ మల్లికార్జున, ఎస్ఐ షేక్‌షావలి

చిత్తూరు అర్బన్: ఇటీవల చిత్తూరులో జరిగిన బంగారు ఆభరణాల చోరీ కేసుల్లో నిందితులను అరెస్టు చేయడంతో పాటు ఆభరణాలను రికవరీ చేసిన పోలీసు అధికారులకు ఎస్పీ రిషాంత్‌రెడ్డి నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. మంగళవారం చిత్తూరులోని పోలీసు శిక్షణ కేంద్రంలో జరిగిన నేర సమీక్షలో వన్‌టౌన్ సీఐ విశ్వనాథరెడ్డి, ఎస్ఐ మల్లికార్జునతో పాటు ఎస్ఆర్ పురం ఎస్ఐ షేక్‌షావలీలకు నగదు రివార్డులు అందజేశారు. ఓ మహిళా ప్రయాణికురాలి నుంచి రూ.15 లక్షల విలువ చేసే 262 గ్రాముల బంగారు ఆభరణాలను రికవరీ చేయడంలో ఎస్ఆర్ పురం ఎస్ఐ షేక్‌షావలి, చిత్తూరులోని హైరోడ్డులో కీర్తన ఫైనాన్స్‌కు సంబంధించిన రూ.17 లక్షల విలువైన 440 గ్రాముల బంగారు ఆభరణాల చోరీ కేసును ఛేదించిన వన్‌టౌన్ సీఐ విశ్వనాథరెడ్డి, ఎస్ఐ మల్లికార్జునకు నగదు రివార్డులు అందజేశారు.